క్లుప్తంగా

ఎమ్మెల్యే, మాజీ ఎంపీని కలిసిన నేతలు


ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిలతో నాయకులు

ఆత్మకూరు: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నెల్లూరులోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. ఆత్మకూరు, చేజర్ల మండలాలకు చెందిన నాయకులు కామాక్షయ్యనాయుడు, పూనూరు రామమనోహన్‌రెడ్డి, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, కరుణాకర్ తదితరులు ఎమ్మెల్యే, ఎంపీలను కలిసి పలు అంశాలపై చర్చించారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కేసులు

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఉదయగిరి సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్–30 అమలులో ఉంటుందని, ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని సీఐ వి.గిరిబాబు హెచ్చరించారు. ఆయన సోమవారం ఉదయగిరిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు గుమికూడరాదని, పోలీస్ యాక్ట్–30 అమలులో ఉన్నందున సంబరాలు, ర్యాలీలు నిషేధమని తెలిపారు. సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రజలు సహకరించాలి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ యాక్ట్–30 అమలులో ఉందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఏఎస్‌పేట ఎస్సై ప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం ఏఎస్‌పేటలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ జరిగే సమయంలో ఏ పార్టీ గెలిచినా రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసినా, బాణసంచా కాల్చినా, అల్లర్లు సృష్టించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కౌంటింగ్ ముగిసే వరకు ప్రజలు ప్రశాంత వాతవరణంలో ఉండాలని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు గుంపుగా చేరవద్దని సూచించారు.

6, 7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు పనిచేయవు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న కారణంగా ఈ నెల 6, 7వ తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు పనిచేయవని డిపో మేనేజర్ కరిమున్నీసా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి బస్‌పాస్‌ల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వ్యర్థాల తొలగింపు


ట్రాక్టర్‌లో వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం మెరుగుకు సోమవారం చర్యలు చేపట్టారు. మురుగు కాలువలు వ్యర్థాలతో నిండి ఉండడంతో తొలగించి ట్రాక్టర్ల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.55,800 విరాళం

కోవూరు: మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన కోడూరు సాన్విక రూ.55,800 విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ మొత్తాన్ని నెట్‌బ్యాంకింగ్ ద్వారా ఆలయ ఖాతాకు జమ చేసినట్లు ఈఓ గిరికృష్ణ తెలిపారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కోవూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. సోషల్ మీడియా వేదికగా ఎలాంటి వివాదస్పద పోస్టులు పెట్టవద్దన్నారు.

వర్షంతో ప్రజలకు ఊరట


ఆత్మకూరులో కురుస్తున్న వర్షం


ఆత్మకూరురూరల్: పడకండ్ల పొలాల వద్ద దట్టంగా అలుముకున్న మేఘాలు

- దట్టంగా మేఘాలు కమ్ముకుని జల్లులు కురిసిన వైనం
- వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందిన ప్రజలు

సంగం: నైరుతి రుతుపవనాల నేపథ్యంలో సంగం మండలంలో సోమవారం జోరుగా వర్షం కురిసింది. మండలంలో వేకువజాము నుంచి వాతావరణం చల్లబడి జల్లులు కురిశాయి. ఇప్పటివరకు తీవ్ర ఎండలతో అల్లాడిన ప్రజలకు వర్షంతో కొంత ఊరట లభించింది.

వాతావరణం చల్లబడి..

ఆత్మకూరురూరల్: నైరుతి రుతుపవనాల నేపథ్యంలో ఆత్మకూరు మండలంలో ఆదివారం రాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇటీవల వేసవితాపం, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతోపాటు చల్లని గాలులను ఆస్వాదించారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: గత రెండు నెలలుగా తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు పడిన ఆత్మకూరు ప్రజలకు సోమవారం తెల్లవారుజామున కురిసిన జల్లులు కొంత ఉపశమనాన్ని కలిగించాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షంతో వేసవితాపం తీరినట్లైంది. వర్షంతో వాతావరణం చల్లబడి ప్రజలు సేదదీరారు.

మెట్టప్రాంతంలో..

సీతారామపురం: మెట్టప్రాంతమైన సీతారామపురం మండలంలో గత కొన్నిరోజులుగా తీవ్రమైన ఎండ, వడగాల్పులతో అట్టుడుకుతున్న ప్రజలకు నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆది, సోమ వారాల్లో కురిసిన ఓ మోస్తరు వర్షం కొంత ఊరటనిచ్చింది. రాత్రి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులొచ్చి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. వాతావరణం చల్లబడడంతో జనం ఊపిరి పీల్చుకుంటున్నారు. అలాగే నీటికుంటలకు జలకళ వచ్చింది.

ఓ మోస్తరు వర్షం

వరికుంటపాడు: వరికుంటపాడు మండలంలోని పలుచోట్ల సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో తొలకరి జల్లులు కురిశాయి. ఫలితంగా వాతావారణం చల్లబడింది. ఈ ఏడాది ముందుగా రుతుపవనాలు రావడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు దుక్కులు దున్నేందుకు సమాయత్తమవుతున్నారు.

చెదురుమదురు జల్లులు

అల్లూరు: నైరుతి రుతుపవనాల ప్రభావంతో సోమవారం అల్లూరు మండలంలోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి చెదురుమదురు జల్లులు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత నెల రోజులుగా ఎండవేడిమికి తాళలేక ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


సీతారామపురంలోని బాలగుర్రప్పకుంటలో చేరిన నీరు

నీటమునిగిన వేరుశనగ ఓదెలు

ఉదయగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో గత రెండ్రోజులుగా కురిసిన వర్షానికి చేతికొచ్చిన వేరుశనగ పంట నీటమునిగి రైతన్నకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గ్రామానికి చెందిన దేవసాని శ్రీనివాసులురెడ్డి తన ఒకటిన్నర ఎకరా పొలంలో సుమారు రూ.40 వేలు ఖర్చు చేసి వేరుశనగ పంట సాగు చేశాడు. పంట కోతదశకు రావడంతో రెండ్రోజుల క్రితం కూలీలతో పంట తీయించి మిషన్ ఆడించేందుకు ఓదెలు పొలంలోనే ఉంచాడు. ఆది, సోమ వారాల్లో కురిసిన వర్షాలకు పొలంలో నీరుచేరి ఓదెలన్నీ నీటమునిగాయి. వ్యవసాయాధికారులు నీట మునిగిన పంటను పరిశీలించి తనకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నాడు.



విజయోత్సవాలు, సంబరాలకు అనుమతుల్లేవు

వరికుంటపాడు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం గెలుపొందిన అభ్యర్థులు, పార్టీ శ్రేణులు విజయోత్సవాలు, సంబరాలు జరుపుకునేందుకు అనుమతులు లేవని ఎస్సై కె.తిరుపతయ్య తెలిపారు. ఆయన సోమవారం వరికుంటపాడులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏ పార్టీకి చెందిన వారైనా రెచ్చగొట్టే ధోరణిలో ప్రవర్తించకూడదన్నారు. 144 సెక్షన్, పోలీసు యాక్ట్–30 అమలులో ఉన్నాయని తెలిపారు. సమావేశాలు, సభలు, సంబరాలు, ర్యాలీలు నిషేధమని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే మెసేజ్‌లు పంపినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులతో నిఘా ఉంచామని తెలిపారు.


మాట్లాడుతున్న ఎస్సై తిరుపతయ్య

దుకాణాల మూసివేత

పొదలకూరు : పట్టణంలోని దుకాణాలను సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు పోలీసులు మూసివేయించారు. అత్యవసరమైన మందుల షాపులను తప్పించి మిగిలిన అన్ని రకాల వ్యాపార సంస్థలను మూసివేయాల్సిందిగా సీఐ ఆర్ రాంబాబు ఆదేశించారు. పట్టణంలో శాంతిభద్రతలపైన పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురు వ్యక్తులు గుంపులుగా చేరి రాజకీయ చర్చలు చేపట్టరాదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ర్యాలీలు, సంబరాలు, బాణసంచా కాల్చడానికి అనుమతి లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో సోమవారం జరిగింది. నెల్లూరులోని కొత్తూరు ప్రాంతానికి చెందిన ఖాదర్‌మొహిద్దీన్ పని నిమిత్తం మోటార్‌బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి కొత్తూరుకు వెళుతుండగా, పొలిచెర్లపాడు క్రాస్ రోడ్డు వద్ద మోటారు బైక్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖాదర్‌మొహిద్దీన్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

ప్రజలు సామరస్యంగా మెలగాలి

సీతారామపురం: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలంతా సోదరభావంతో సామరస్యంగా మెలగాలని ఎస్సై పి.అనూష సూచించారు. ఆమె సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల నియామవళిపై వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సాధారణమైన విషయమన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఆయా పార్టీల అభిమానులు ఊరేగింపులకు దూరంగా ఉండాలని, బాణసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం లాంటి చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున వ్యాపారులు మంగళవారం స్వచ్ఛందంగా వారి దుకాణాలను మూసివేసి పోలీసులకు సహకరించాలని కోరారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీసుశాఖ నిరంతర నిఘా ఉంచుతుందన్నారు. రెచ్చగొట్టే పోస్టులు, ఫొటోలు, వీడియోలు షేర్ చేయడం నిషిద్ధమైనందున గ్రూపు అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.


దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అనూష

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఆత్మకూరు: పట్టణానికి చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు బాధిత కుటుంబాలకు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇటీవల ఏడుగురు మృతిచెందగా.. ఆయా కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి అందజేశారు. ఒకటో వార్డు పరిధిలోని కోలా అంకమ్మ, నలగట్ల పెంచలయ్య, 5వ వార్డు పరిధిలోని ఉప్పుటూరు సుబ్రహ్మణ్యం, 8వ వార్డు పరిధిలో గుండ్లూరు సుబ్బారావు, గాలి కమలమ్మ, 18వ వార్డు పరిధిలో షేక్ మునీర్‌జా, షేక్ పర్వీన్ మృతి చెందగా.. వారి కుటుంబాలకు ఈ ఆర్థికసాయాన్ని అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు, విశ్రాంత హెచ్ఎం కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి


వైద్యశిబిరం నిర్వహించేందుకు వచ్చిన ఆరోగ్య సిబ్బంది

చేజర్ల: రాష్ట్ర ప్రభుత్వం 104 వాహనాల ద్వారా గ్రామాల్లో అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యురాలు మెహతాబ్ సూచించారు. సోమవారం చేజర్ల మండలంలోని మాముడూరు ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. గర్భిణులను పరీక్షించి వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, హెచ్‌వీ నరసమ్మ, సిబ్బంది వి.కామేశ్వరి, పి.భానుప్రియ, ఎస్‌కే దిల్‌షాద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

సంగం: స్థానిక శ్రీరామచంద్రాపురం రామాలయంలో హనుమాన్ జన్మోత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్ల కణోత్సవాన్ని తిలకించి తరించారు.


సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

మలేరియా నివారణపై అవగాహన

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పనారెడ్డి సూచనల మేరకు మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మలేరియా నివారణపై సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రధాన కూడళ్లు, దుకాణాల వద్ద డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధుల నివారణపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, రబ్బాని, నాగార్జున, నూర్జహాన్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్

సీతారామపురం: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సీతారామపురం మండలంలోని సింగారెడ్డిపల్లి, బసినేనిపల్లి, సీతారామపురం తదితర గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అలాగే మొబైల్ బృందాలను సైతం ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దంటూ ప్రజలను పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఘర్షణలకు పాల్పడిన వారిని బైండోవర్ చేస్తున్నారు. కౌంటింగ్ రోజున శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉండడంతో ఎస్సై అనూష లాడ్జిలతోపాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.


లాడ్జిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై అనూష

మెజారిటీపై జోరుగా చర్చలు

కావలి: కావలి ఓటర్ల తీర్పు మరికొన్ని గంటల్లో వెలువడనుంది. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి బరిలో దిగారు. పలు సర్వేల్లో కావలిలో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమని స్పష్టమైంది. ఎగ్జిట్ పోల్స్‌లోనూ కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజయం సాధిస్తారని ఆయా సంస్థలు ప్రకటించాయి. దీంతో అభిమానులు మెజారిటీపైనే దృష్టి సారించారు. 20 వేల పైచిలుకు మెజారిటీ ఖాయమని జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఈ దఫా పోలింగ్ శాతం పెరగడం కూడా మెజారిటీ పెరిగేందుకు కారణమవుతుందని విశ్లేషిస్తున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా 6.68 శాతం పోలింగ్ శాతం పెరిగి రికార్డు స్థాయిలో 83.5 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా కావలి రూరల్ మండలంలో 89.93 శాతం పోలింగ్ నమోదు కాగా, కావలి పట్టణంలో 76.26 శాతం, అల్లూరు మండలంలో 84 శాతం, బోగోలులో 84.12 శాతం, దగదర్తి మండలంలో 89.01 శాతం పోలింగ్‌తో ప్రజలు తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. నెల్లూరులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. కావలి నియోజకవర్గంలోని మొత్తం 314 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 23 రౌండ్లలో ఫలితం పూర్తిగా తేలనుంది. తొలి రెండు, మూడు గంటల్లోనే గెలుపు ఎవరిదో స్పష్టం కానుంది. పది రౌండ్లు పూర్తయ్యే సరికి మెజారిటీపై స్పష్టమైన అంచనా వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యసేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కొడవలూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలందుతున్నాయని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గుండాలమ్మపాళెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఇద్దరికి ఇంటి వద్దకే వెళ్లి వైద్యపరీక్షలు చేసి వైద్య సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖ అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ పేదల పాలిట బృహత్తర కార్యక్రమమని అభివర్ణించారు. ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి పరిష్కరించేందుకు వెసులుబాటు కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాకానుక సిద్ధం

- ఎమ్మార్సీల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్
- విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పిన ఖర్చులు


ఉదయగిరి స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వరికుంటపాడు: గత ప్రభుత్వాల పాలనలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటే తల్లిదండ్రులకు ఖర్చుతో కూడుకున్న పని. జూన్ నెల వచ్చిందంటే విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, నోటుపుస్తకాలు, యూనిఫాం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించేలా ప్రభుత్వమే ఖర్చులు భరించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తోంది. పాఠశాలల ప్రారంభం నాటికే జగనన్న విద్యాకానుక పేరుతో విద్యాసామగ్రిని ఎమ్మార్సీలకు చేర్చి విద్యార్థులకు ఉచితంగా అందించేలా ఏర్పాట్లు చేసింది.

పుస్తకాలొచ్చేశాయ్..

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ జరుగుతున్నప్పటికీ విద్యార్థుల చదువులకు లాంటి ఆటంకాలు కలగకూడదనే ఆలోచనతో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాకానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తదితర సామగ్రి మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. వాటిని విద్యాశాఖ సిబ్బంది తరగతుల వారీగా విభజించారు. ఆయా పాఠశాలలకు చేర్చేందుకు ఎంఈఓలు సమయాత్తమయ్యారు. ఉదయగిరి మండలంలో 69, వరికుంటపాడు మండలంలో 58, దుత్తలూరు మండలంలో 56, సీతారామపురం మండలంలో 41 ప్రభుత్వ (ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత) పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలకు 49,523 పాఠ్యపుస్తకాలు, 60,502 నోటు పుస్తకాలు వచ్చాయి. ఇంకా కొంతమేర పుస్తకాలు రావాల్సి ఉంది.

పెరుగుతున్న విద్యార్థులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్ది విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పేందుకు ఆసక్తి చూపుతున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపి పెరుగుతోంది. జగనన్న విద్యాకానుక కిట్లు, గోరుముద్ద, అమ్మఒడి తదితర పథకాలు విద్యార్థులు బాగా చదువుకునేందుకు ఎంతో దోహదపడుతున్నాయని తల్లిదండ్రులే చెబుతుండడం గమనార్హం.

పాఠశాలల ప్రారంభం రోజే కిట్లు పంపిణీ



2024–25 విద్యాసం వత్సరానికి సంబంధించి విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి కిట్లు మండల స్టాక్ పాయింట్‌కు చేరాయి. వాటిని తరగతుల వారీగా వేరు చేసి ఉంచాం. ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందించి బడి ప్రారంభం రోజునే విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– తోట శ్రీనివాసులు
ఎంఈఓ–2, ఉదయగిరి